**COMMUNIST PARTY OF INDIA (MARXIST)**

**ANDHRA PRADESH COMMITTEE**

H.No. 27-30-9, CPI(M) State Committee Office
Akulavari Street, Governor Pet, Vijayawada -2
☎ 0866 - 2577202, Fax: 0866 - 2577203
E-mail: cpimap@gmail.com


ప్రచురణార్థం/ప్రసారార్థం : విజయవాడ,

**తేది : 07 ఏప్రిల్, 2023.**

# వాకపల్లి బాధిత మహిళలకు ఒక్కొక్కరికి రూ.25 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలి దర్యాప్తు జరపని అధికారులపై చర్యలు తీసుకోవాలి

అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు పోలీసు స్టేషన్ పరిధిలో 2007లో వాకపల్లి గ్రామంలో గ్రేహౌండ్స్ పోలీసులు గిరిజన మహిళలపై లైంగిక దాడి ఘటనలో నిందితులకు శిక్షపడకపోవడం న్యాయ చరిత్రలో విషాద ఘటనగా సిపిఐ(యం) భావిస్తున్నది. ప్రభుత్వ అసమర్థత, పోలీసు ఉన్నతాధికారులు నేరస్తుల కొమ్ముకాచే వైఖరి దీనికి కారణం. కోర్టుతీర్పుననుసరించి తక్షణ దర్యాప్తు జరపని పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబాలకు రూ.25 లక్షలు చొప్పున పరిహారం ఇచ్చి ఆదుకోవాలని భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేస్తున్నది.

సుదీర్ఘకాలం జరిగిన విచారణ అనంతరం కోర్టు తీర్పు సందర్భంగా జడ్జి వ్యాఖ్యలను రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోవాలి. దీన్ని గుణపాఠంగా తీసుకొని వేరే కేసుల్లో బాధితులకు అన్యాయం జరగకుండా చూడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉంది. పోలీసులే నిందితులుగా ఉన్న ఘటనలో పోలీసులనే దర్యాప్తు అధికారులుగా నియమించడం అమానుషం. అత్యాచారం చేసిన పోలీసులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఆనాడు ఐక్య వేదిక ఆధ్వర్యంలో గిరిజన మహిళలు ఆందోళనలు చేసినప్పటికీ, దర్యాప్తు తీరుపట్ల పలు విమర్శలు వెల్లువెత్తినప్పటికీ ఆనాటి రాష్ట్ర ప్రభుత్వం స్పందించలేదు. సిబిసిఐడి పోలీసులు సరిగ్గా దర్యాప్తు జరపలేదు. నేడు కోర్టుకూడా అదే విషయాన్ని తీర్పులో చెప్పింది.

రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా దర్యాప్తు సక్రమంగా జరపని పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలి. లైంగిక దాడికి పాల్పడిన గ్రేహౌండ్స్ పోలీసులను శిక్షించాలి. బాధిత మహిళలకు ఒక్కొక్కరికి రూ.25 లక్షల చొప్పున నష్టపరిహారం ఇవ్వాలి. దళితులు, గిరిజనుల పట్ల దాడులు పెరుగుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం మరింత కఠినంగా వ్యవహరించాలని కోరుతున్నది.

**(వి.శ్రీనివాసరావు)**
రాష్ట్ర కార్యదర్శి